దేవీ వైభవం.. భక్తుల తన్మయత్వం



సంగారెడ్డి: శాకంబరి రూపంలో నాగమానసాదేవి



ఐడీఏ బొల్లారంలో లలితా త్రిపుర సుందరీదేవి



కానుకుంటలో లలితాదేవి అలంకరణలో మహంకాళి



జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, ఝరాసంగం, జిన్నారం, గుమ్మడిదల.


పోలీసుల బతుకమ్మ ఉత్సవాలు



బతుకమ్మలతో ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు తదితరులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పోలీసు శాఖ ఆధ్వర్యంలో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించామని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన సంబరాల్లో ఆయన అదనపు ఎస్పీ సంజీవరావుతో కలిసి పాల్గొన్నారు. పోలీసు కుటుంబాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు సత్తయ్య గౌడ్, రవీందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, నరేందర్, మహిళా రక్షణ విభాగం సీఐ ప్రమీల, ఎస్ఐ నాగలక్ష్మి, ఎస్పీ కార్యాలయం ఏవో కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు జశ్వంత్



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అమీన్‌పూర్ మండలం బృందావన్ టీచర్స్ కాలనీకి చెందిన జశ్వంత్ రాథోడ్ ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో ఎంపికయ్యాడని, ఉత్తర్‌ప్రదేశ్‌లోని నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ రామారావు తెలిపారు.

వారధులు వర్షార్పణం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్

మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

జిల్లాలో ఏటా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. శాశ్వత మరమ్మతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మార్గంలో నిత్యం ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యను గుర్తించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజినీర్లు చెబుతున్నారు.



కుస్నూర్ వాగుపై కోతకు గురైన వంతెన

రాకపోకలకు ఇబ్బందులు

● రాయికోడ్ మండలం సిరూర్ సమీపంలో వంతెన కుంగిపోయింది. మరమ్మతులకు రూ.9.90 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు రూపొందించారు. పనులు ఇప్పటికీ చేపట్టలేదు. చిమ్నాపూర్-కుస్నూర్ మార్గంలో రాఘవాపూర్ సమీపంలో వంతెన వర్షాలకు ధ్వంసమయింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వంతెన మరమ్మతులకు రూ.3 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధుల జాడ లేదు. ● ఝరాసంగం మండలం బోపన్‌పల్లి, దేవరంపల్లి, ప్యారారం సమీపంలో వర్షం కురిస్తే చాలు అక్కడి చిన్న వంతెనలపై నుంచి వరద పారుతోంది. ఏటా రాకపోకలు నిలిచిపోతున్నాయి. అక్కడ రూ.3 కోట్లతో వంతెన నిర్మించాలనే ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. వరదతో దేవరంపల్లి, ప్యారారం, ఈదులపల్లి, బోపన్‌పల్లి గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ● న్యాల్‌కల్ మండలం గంగ్వార్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మెటల్‌కుంట, బసంత్‌పూర్, కల్బేముల్ దారిలో వంతెన శిథిలమయింది. జనం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులకు రూ.18 లక్షల నిధులు కావాలని సంబంధిత శాఖ అధికారులు గుర్తించారు. ● న్యాల్‌కల్ మండలం టేకూర్ దారిలో టేకులపల్లి సమీపంలో వారధి ధ్వంసమయింది. మరమ్మతులకు రూ.40 లక్షలు కావాలని ప్రతిపాదించినప్పటికీ మంజూరు కాలేదు. ● అమీన్‌పూర్ మండలం రామేశ్వరం బండ సమీపంలో, పటాన్‌చెరు మండలం పాశమైలారం శివారులో, పటాన్‌చెరు మండలం నందిగామ వద్ద, మల్కాపూర్ మార్గంలో వంతెనలు దెబ్బతిన్నాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

విభాగం	శిథిల వారధులు	నిధుల అంచనా (రూ.కోట్లలో)
ఆర్‌అండ్‌బీ	6	18.50
పంచాయతీరాజ్	6	5.08

నిధులు రాగానే పనులు చేపడతాం

జిల్లాలో గతంలో, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు బాగు చేసేందుకు నిధులు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. సర్కారు నుంచి నిధులు మంజూరు చేయగానే.. పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారుతో ఒప్పందం చేసుకుంటాం. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. వారధులకు మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. –జగదీశ్వర్, పీఆర్ ఎస్ఈ, వి.రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం: సీపీఎం



జెండావిష్కరణలో నాయకులు

పుల్కల్, న్యూస్‌టుడే: కేసులకు భయపడకుండా ప్రజలు, కార్మికుల పక్షాన సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జి.సాయిలు పేర్కొన్నారు. చౌటకూరు మండలం శివ్వంపేటలో ఆదివారం అందోలు ప్రాంత మహాసభ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు సహకారం అందిస్తూ, కార్మికులు, రైతులు, సామాన్యుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏరియా కన్వీనర్ విద్యాసాగర్, చౌటకూరు పుల్కల్ మండలాల బాధ్యులు నాగభూషణం, కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

తోపుడు బళ్లు... ట్రాఫిక్ ఇక్కట్లు



నారాయణఖేడ్ పట్టణంలో అసలే ఇరుకు రోడ్లు.. నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు రోడ్లపైనే తోపుడు బళ్లు వరుసగా పెట్టి పండ్లు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు అధికమవుతున్నాయి. ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌కూడలి, అంబేడ్కర్ కూడలి, బసవేశ్వరకూడలిల వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా తోపుడు బళ్లు పెట్టవద్దని సూచించారు. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్.

అంతిమ యాత్రకూ ఆపసోపాలు



ఇటీవల కురిసిన వానలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. కంది మండలం మామిడిపల్లిలో ఊరకుంట శిఖం, ఎఫ్‌టీఎల్‌లో డంపింగ్ యార్డు, వైకుంఠధామం గతంలో నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద వాటిలోకి చేరి తటాకాలను తలపిస్తున్నాయి. అంతిమయాత్ర, మృతదేహాల దహనాలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు తెలిపారు. –న్యూస్‌టుడే, కంది.

ఎన్‌జీసీకి 13 పాఠశాలలు ఎంపిక

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట



విద్యార్థులకు పర్యావరణం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ హరిత దళం(ఎన్‌జీసీ) లక్ష్యం. ఎన్‌జీసీకి కొన్ని సంవత్సరాలుగా నిధులు కేటాయింపు లేకపోవడంతో పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ ఎన్‌జీసీ కార్యక్రమాలు బలోపేతం చేసేలా జిల్లాలో ప్రయోగాత్మకంగా 13 పాఠశాలలను ఎంపిక చేశారు. జులైలో ప్రతిపాదనలు తీసుకొని.. తాజాగా ఎంపిక జాబితాను విడుదల చేశారు. కార్యక్రమాల నిర్వహణ వీటికి ఏడాదికి రూ.10 వేల చొప్పున నిధులు అందిస్తారు.

అమలు చేయనున్న కార్యక్రమాలు

జిల్లాలో 503 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13 బడులను ప్రయోగాత్మకంగా మొదట హరితదళం కింద ఎంపిక చేశారు. ఈ పాఠశాలలకు హరితదళం కార్యక్రమాలకు రూ.10 వేల నిధులు కేటాయిస్తారు. నేరుగా ఆ పాఠశాల ఖాతాలోనే జమ చేస్తారు. బడుల్లో ఖాళీ స్థలం, పెరటి తోటల పెంపకం, ఇందుకు అనువైన వాతావరణం, విద్యార్థుల సంఖ్య తదితర ప్రాధాన్య అంశాల ఆధారంగా ఎంపిక చేశారు. వీటిలో పెరటి తోటల పెంపకంతోపాటు.. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి భద్రపరచాలి. సేంద్రియ ఎరువు తయారు చేయాలి. పెరటి తోటలకు సేంద్రియ ఎరువు అందించాలి. పండిన కూరగాయలతో మధ్యాహ్న భోజన వంటలు సిద్ధం చేయాలి. దసరా సెలవుల అనంతరం పూర్తి స్థాయిలో కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

జిల్లాలో 13 పాఠశాలలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. వీటిలో ఉన్నతాధికారులు నిర్దేశించిన విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తారు. – మాధవరెడ్డి, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త.

సమన్వయకర్తగా సైన్స్ ఉపాధ్యాయుడు

జాతీయ హరిత దళం కింద ఎంపికైన పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తారు. సేంద్రియ ఎరువు తయారీతో పాటు వర్షపు నీటి సంరక్షణ, పరిశుభ్రత, కూరగాయల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకొని సంరక్షించాలి. పర్యావరణ ర్యాలీలు, గ్రామాల్లో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడతారు. వీటిని పర్యవేక్షించేందుకు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడిని సమన్వయకర్తగా నియమిస్తారు. జిల్లా అధికారులు ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో కార్యక్రమాలు అమలు చేసేలా అవగాహన కల్పిస్తారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో ఊరేగించారు. అనంతరం వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త నరసింహాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయండి: ఎమ్మార్పీఎస్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తానని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు.

పేద మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి: జగ్గారెడ్డి



వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు, పక్కన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి నియోజకవర్గంలో నిరుపేద మైనార్టీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేలా చొరవ చూపుతానని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి నియోజకవర్గంలో మైనార్టీలు, పలువురు మత పెద్దలతో కలిసి ఆయన హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడారు. త్వరలో ఇళ్ల స్థలాల సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖలను కలుస్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంగారెడ్డిలో మైనార్టీల శ్మశాన వాటికకు నాలుగు ఎకరాలు ఇవ్వాలని, ఆ స్థలానికి ప్రహరీ, నీటి వసతి, తదితర సౌకర్యాల కోసం రూ.2 కోట్లు కేటాయించాలని కోరారు.

త్వరలో గోదావరి చక్కెర పరిశ్రమ ప్రారంభం

రాయికోడ్, న్యాల్‌కల్: రాయికోడ్ మండలం మాటూరు శివారులోని గోదావరి-గంగా చక్కెర పరిశ్రమ బాయిలర్ పూజా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరిశ్రమ డైరెక్టర్ మహేష్ బండారి మాట్లాడుతూ.. పక్షం రోజుల్లో కర్మాగారాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. చెరకు పంటకు కనీస మద్దతు ధర, క్రషింగ్ తదితర వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అగ్రిమెంట్ చేసుకున్న రైతులందరి నుంచి పంట కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కర్మాగారం జీఎం విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టారు. ఒక ఇంట్లో మాత్రమే దొంగతనం జరిగింది. సత్యనారాయణ ఇంట్లో 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

గ్రామానికి దాత చేయూత

మురుగు కాలువపై బండల ఏర్పాటుకు రూ.20 లక్షల సాయం



మురుగు కాలువలపై బండలు ఏర్పాటు చేస్తున్న కూలీలు

కోహీర్, న్యూస్‌టుడే: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు దాత సాయం చేశారు. మండలంలోని సజ్జాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త కుడిముస్కుల ప్రసాదరెడ్డి రూ.20 లక్షలతో జూన్‌లో ప్రతి వీధిలోని మురుగు కాలువలపై బండలు ఏర్పాటు చేయించారు. వర్షాకాలంలో ఇళ్ల ముందు మురుగు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. ఈగలు, దోమల వ్యాప్తి తగ్గింది. మండలంలోని ఇదే మండలం పీచేర్యాగడితండాలో ప్రసాదరెడ్డి సొంత ఖర్చుతో మురుగు కాలువల పైకప్పు ఏర్పాటు పనులను చేపట్టనుండగా.. మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన పెరిగేదెలా?

మహిళా సంఘాల 'ద్వితీయ' సమావేశాలపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: మహిళలకు ఆరోగ్యంపై అవగాహన ఉంటేనే.. ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుంది. ఇదే ఉద్దేశంతో ప్రతినెలా ప్రత్యేకంగా ద్వితీయ సమావేశాలు నిర్వహించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రెండేళ్ల కిందటే ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో చాలా చోట్ల సక్రమంగా అమలు కావడంలేదు. పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం.



మహిళా సంఘం సభ్యుల సమావేశం

కొరవడిన పర్యవేక్షణ

మహిళా సంఘం సభ్యులు నెలకోసారి సమావేశమయ్యేవారు. పొదుపులు, అప్పులు, రుణవాయిదాల చెల్లింపులపై చర్చలు జరిగేవి. రెండేళ్ల కిందటి వరకు ఇదే పరిస్థితి. ఆరోగ్యం పైనా మహిళల్ని చైతన్యం చేయాలనే లక్ష్యంతో నెలకోసారి నిర్వహిస్తున్న సమావేశానికి తోడు అదనంగా మరో సమావేశాన్ని నిర్వహించాలన్న నిబంధన తీసుకొచ్చారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు నెలలో రెండు సార్లు సమావేశం కావాల్సిందే. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడంతో ఒక సమావేశంతోనే సరిపెడుతున్నారు.

● జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
● పొదుపు సంఘాలు: 18,208
● వాటిలో సభ్యులు: 1.91 లక్షలు

ఏం చర్చించాలంటే..

ప్రతినెలా నిర్వహించే ద్వితీయ సమావేశంలో ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా ఉంటుంది. సంఘంలోని సభ్యులు, కుటుంబీకుల ఆరోగ్యంపై చర్చించాలి. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించాలి. అవసరమైతే ఆరోగ్య సిబ్బందిని సమావేశానికి ఆహ్వానించి సలహాలు, సూచనలు అందేలా చూడాలి. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో పెరటి తోటల్లో కూరగాయలు పండించే విధానంపై అవగాహన కల్పించాలి. హరితహారంలో భాగంగా పండ్ల మొక్కలు కూడా పెంచుకునేలా ప్రోత్సహించాల్సి ఉంటుంది. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై సమావేశాలల్లో వివరించాలి.

సక్రమంగా జరిగేలా చూస్తాం

మహిళా సంఘాల సభ్యులతోపాటు వారి కుటుంబాల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడమే ద్వితీయ సమావేశాల లక్ష్యం. వాటిని సక్రమంగా జరిగేలా చూడాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశిస్తాం. సంఘంలోని సభ్యుల్లో ఎవరికైనా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటే అందరూ చేయూతనందించాలి. సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

–జంగారెడ్డి, అదనపు డీఆర్డీవో.

సర్వే సమయంలో హడావుడి

మహిళా స్వయం సహాయక సంఘాల స్థాయిలో నిర్వహిస్తున్న ద్వితీయ సమావేశాల అమలు తీరుపై పేదరిక నిర్మూలన సంస్థ ఏడాది కిందట సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. జిల్లాలో ఐదు మండలాల్లో బృందాలు పర్యటించి సర్వే నిర్వహించాయి. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామంలో ద్వితీయ సమావేశాల తీరును పరిశీలించారు. అధికారుల బృందం పర్యటన నేపథ్యంలో హడావుడి చేశారు. ఆ తర్వాత సమావేశాలపై పర్యవేక్షించే వారు కరవయ్యారు.

ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుల ర్యాలీ



సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సంగారెడ్డి పట్టణంలో స్వయం సేవకులు 'పద సంచాలన్' పేరిట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, ముఖ్య అతిథి డాక్టర్ పాలస్వామి గౌడ్ పాల్గొని మాట్లాడారు. విజయదశమి రోజున ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ ఇప్పటికే 99 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. పద సంచాలన్‌లో ఉమ్మడి జిల్లా సహ కార్య నిర్వాహక్ నర్సింలు, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌గా అంజయ్య



సంగారెడ్డి మున్సిపాలిటీ, రాయికోడ్, న్యూస్‌టుడే: గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌గా రాయికోడ్ మండలం నాగ్వాల్‌కు చెందిన అంజయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో రాయికోడ్ ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేశారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయాల సేవలు జిల్లా ప్రజలందరికీ అందేలా చొరవ చూపుతానని పేర్కొన్నారు.

ప్రకృతి ఆరాధనే.. బతుకమ్మ..

బతుకమ్మ పూల పండగ.. ప్రకృతిని ఆరాధించే వేడుక.. మనుషుల మధ్య బంధాన్ని పెంచడంతో పాటు అందరి బతుకును కోరుతుంది. ఇదే బతుకమ్మ పరమార్థం. ఇందులో ఉండే విశేషాలు, పాటల్లో ఉండే అంశాలు ప్రజలకు తెలియజెప్పే లక్ష్యంతో పలువురు దీనిపై అధ్యయనం చేశారు. ఆయా విశేషాలు ఇలా..

- న్యూస్‌టుడే, సిద్దిపేట, చేర్యాల

28 ఏళ్లుగా పరిశోధన..




పాడి పంటలు, పర్యావరణంతో ముడిపడిన పండగ బతుకమ్మ అని అంటారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు సహ ఆచార్యులు డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి. స్వస్థలం కరీంనగర్. 2002లో ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ప్రస్థానం మొదలైంది. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి అంటే అమిత ఆసక్తి. 2014లో తెలంగాణ కథా సాహిత్యం- స్థానికతపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1996లో బతుకమ్మ, జానపద పాటలపై పరిశోధన ఆరంభించారు. 28 ఏళ్లలో 60కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. 200కి పైగా బతుకమ్మ పాటల్లో అంశాలను అధ్యయనం చేసి ఎన్నో విషయాలు వెల్లడించారు. వ్యవసాయం, ఆడబిడ్డ, పర్యావరణం, చరిత్ర, స్త్రీ పురుష సంబంధాలు, మానవీయ, ప్రకృతి, జీవకోటి, ఆహారం అటవీ, జల వనరుల అంశాల్లో ముడిపడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల గంగ దర్వాజ పేరిట పుస్తకం వెలువరించారు. బతుకమ్మ పాటల పుస్తకం ఆవిష్కరణకు సిద్ధమయ్యారు.

పండగ అంతరార్థం ఇది..: సృష్టిలో ఏ ప్రాణికైనా సంతానోత్పత్తి ప్రధాన ఆశయం. పూలు పరపరాగ సంపర్కం జరిపి ప్రతి సృష్టికి సిద్ధమైన తరుణంలో తెలంగాణ సమాజం పూలకు జరిపే పండుగే బతుకమ్మ. సమస్త జీవకోటికి అనుసంధానించే వేడుకగా అభివర్ణించవచ్చు. బొడ్డెమ్మ.. ఎదుగుతున్న స్త్రీకి సంకేతం. బతుకమ్మ.. ఎదిగి పెళ్లి పేరంటం చేసుకున్న స్థితికి సంకేతం. **డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి**

గుర్తించారిలా..

- ఈ పండుగ.. స్త్రీ తత్వం గొప్పతనాన్ని చాటుతుంది. మనిషికి, ప్రకృతికి ఉండే అవినాభావ సంబంధాన్ని చెబుతుంది. ఆడబిడ్డకు, పుట్టినింటికి ఉండే రక్త సంబంధాన్ని వివరిస్తుంది. తెలంగాణ సమాజం వందల ఏళ్లుగా పర్యావరణ విలువలను కాపాడేందుకు చేస్తున్న గొప్ప ప్రయత్నం.
- నిరాడంబరత్వం, ప్రకృతిని కొలిచే విధానం ప్రస్ఫుటమవుతోంది. ప్రతి ఊర్లోనూ పండగను ఉమ్మడిగా చేసుకోవడం నాటి నుంచి అలవర్చుకోవడం విశేషం.

బహుళ ప్రాచుర్యంతోనే..



శాస్త్రీయంగానే కాకుండా మానవ సంబంధాలతో పెనవేసుకున్న బతుకమ్మ విశేషాలను అందరికీ తెలిసేలా ప్రాచుర్యం కల్పించాలని అంటున్నారు చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన విష్ణుమూర్తి. కాకతీయ విశ్వవిద్యాలయంలో 'బతుకమ్మ పండుగ పాటలు (సంస్కృతి సంప్రదాయాలు)'పై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారు. ఉపాధ్యాయుడిగా పని చేసి రెండేళ్ల కిందట పదవి విరమణ పొందారు.

పల్లె స్ఫూర్తితో ఆటా పాటలపై..

విష్ణుమూర్తిది పల్లె నేపథ్యం కావడంతో పండగలపై ఆసక్తి పెరిగింది. ప్రధానంగా ఊరంతా కలిసి చేసుకునే బతుకమ్మ గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత చూపారు. అదే దానిపై అధ్యయనం చేసేలా చేసింది. ఏయే ప్రాంతాల్లో ఈ పండగల ఎలా చేసుకుంటారో తెలుసుకున్నారు. ఆటాపాటలపై పరిశోధన చేశారు. బతుకమ్మ పండగ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని గుర్తించారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ఊరూరా వేదికలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంకేం చేయాలో తన పుస్తకంలో పొందుపరిచారు.

మరెన్నో విషయాలు

జానపద సాహిత్యం మొదలుకొని బతుకమ్మ పండగ స్వరూప స్వభావాలు, పాటల వర్గీకరణతో పాటు సంస్కృతి, సంప్రదాయం తదితర అంశాలను పుస్తకంలో వివరించారు. వ్యవసాయానికి స్త్రీ, పురుష సంబంధాలు- సాంఘిక జీవనం, జానపదుల నమ్మకాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహారం, ఆటలు, వినయం వంటి వెన్నో ఉన్నాయి. పండగ పాటలు, సంగీత నృత్య విశేషాలు, భాషావిశేషాలనూ క్షుణ్నంగా విపులీకరించారు. మహిళలు పాడే పాటల్లోని చంధస్సు, అలంకారాలు, సామెతలు, జాతీయాలు, నుడికారాలు, వర్ణాలు, వర్ణవ్యత్యయం, ప్రత్యాయాలు, నవ్యకల్పన, ఇష్ట దేవతాస్తుతి, మాండలికాలు ఇలాంటి విషయాలను పుస్తకంలో విశ్లేషించారు.



కాలినడకన కదిలి.. అమ్మను దర్శించి



దేశవ్యాప్తంగా దసరా సంబరాలు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయంలో జరిగే ఉత్సవాలు తనివితీరా చూసి తీరాల్సిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, నర్సాపూర్, వికారాబాద్ జిల్లా తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులెంతో మంది అమ్మను ఇలవేల్పుగా కొలుస్తుంటారు. దసరా సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి వెళ్లి అమ్మను దర్శించుకొని మొక్కు చెల్లించుకుంటుంటారు. ఈసారి జాతరకు సైతం భారీగా ప్రజలు బృందాలుగా నడుచుకుంటూ ఆలయం బాట పట్టారు. వారంతా 65వ నంబరు జాతీయ రహదారిపై జహీరాబాద్ మీదుగా తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. మూడు రోజులుగా ఆ రోడ్డంతా కిటకిటలాడుతోంది. దసరా మరుసటి రోజు వరకు ఈ సందడి కనిపిస్తుంది.

అత్యధికులు..

దసరా సందర్భంగా దుర్గమ్మ మండపాలు, ఇళ్లల్లో ప్రతిష్ఠించుకొని పూజించడం ఆనవాయితీ. జహీరాబాద్‌కు 180 కి.మీ. దూరంలో ఉన్న తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకోవడం పవిత్రంగా భావిస్తారు. అత్యధికులు కాలినడకకే ప్రాధాన్యం ఇస్తారు. కొందరు మిత్రులతో కలిసి బృందంగా వెళ్తుంటారు.

అన్నదాన శిబిరాలు..

జహీరాబాద్‌కు చెందిన పలువురు భక్తుల కోసం అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేస్తూ తమవంతు సహకారం అందిస్తున్నారు. జహీరాబాద్- తుల్జాపూర్ మధ్యలో 100కు పైగా శిబిరాలు వెలిశాయి. వీటిలో జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన వారికే సగం వరకు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాజిక చైతన్యం



దుబ్బాక పట్టణంలోని 20వ వార్డులో యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సభ్యులు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక చైతన్యంపై దృష్టి సారించారు. నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ, 'మత్తు వదలరా' పేరిట భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరు గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సైబర్ నేరాలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, దుబ్బాక

నాట్యమయూరి.. నివేదిత



ఓ వైపు నృత్యం.. మరోవైపు నటనలో రాణించడంతో పాటు చదువులో ముందంజలో ఉంటోంది ఈ బాలిక. అందరి మన్ననలు పొందుతున్న ఆ బాలికే సంగారెడ్డి జిల్లా కంగ్టికి చెందిన 12 ఏళ్ల నివేదిత. తల్లిదండ్రులు వర్లలత, దత్తాత్రి. తండ్రి రైల్వే ఉద్యోగి కాగా, తల్లి గృహిణి. ఉద్యోగరిత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు కూచిపూడిపై ఉన్న ఆసక్తితో కుమార్తెను ప్రోత్సహించారు. నాలుగేళ్ల వయసులోనే నివేదిత గురువు శ్రీనివాస్‌వరప్రసాద్ వద్ద ఓనమాలు నేర్చుకున్నారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శన ఇవ్వడం మొదలుపెట్టారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 250కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

సంకల్పంతో సాధన

నివేదిత గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకు సాధన చేస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణకు వెళ్తున్నారు. నృత్యం, మోనో యాక్షన్‌లో ఏకకాలంలో రాణిస్తున్నారు. నాలుగేళ్ల కిందట తానా ఆధ్వర్యంలో నిర్వహించిన మోనో యాక్షన్ ఆన్‌లైన్ పోటీలో రాణిరుద్రమదేవిగా అభినయించి తొలి స్థానంలో నిలిచారు. ఈ పోటీలో 40 దేశాలకు చెందిన 680 మంది కళాకారులు పాల్గొన్నారు. నృత్యకళా బాలప్రతిభా మహోత్సవ్, భారత రంగస్థల, అఖిలనటరాజన్, అంతర సాంస్కృతిక సంస్థాన్, భారతీయ నృత్య సమ్మేళన్, సంస్కారభారతి, రాష్ట్రీయ కళామహోత్సవ్ తదితర అకాడమీలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటి బహుమతులు అందుకున్నారు. ఇటీవల మహానంది, బాలకళాశ్రీ నృత్య పురస్కారాలు అందుకున్నారు. 2024-25కు గాను బాల పురస్కారానికి నామినేషన్ వేశారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్, కంగ్టి

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

జిన్నారం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనదారుడికీ తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూరారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఐడీఏ బొల్లారం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



వెంకటి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన ముత్యం వెంకటి(38) రామాయంపేట పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే రామాయంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అక్కన్నపేటకు వస్తున్నాడు. గ్రామ శివారులోని పకీరు సాబ్ గుట్ట వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి ఎల్లవ్వ ఆయనపైనే ఆధారపడి జీవిస్తోంది.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు



రవీందర్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటుతో తాండూరు పట్టణంలోని షావుకార్‌పేట్‌కు చెందిన కానిస్టేబుల్ కావలి రవీందర్(38) మృతి చెందాడు. పెద్దేముల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎప్పటిలాగే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవడంతో భార్య మహేశ్వరి స్థానికులను పిలవడంతో వారు వచ్చి అతడిని లేపే ప్రయత్నం చేశారు. లేవకపోవటంతో వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. రవీందర్‌కు ఎనిమిదేళ్ల కూతురు శ్రావ్య, నాలుగేళ్ల కొడుకు అభిరాం ఉన్నాడు. పట్టణంలోని గొల్లచెరువు శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యమై..



నర్సయ్య

చేగుంట, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో జరిగింది. స్థానిక ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నర్సయ్య(69) గత నెల 14న సాయంత్రం పొలం సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పొలం సమీపంలో ఉన్న కుంటలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం ఉందని రైతులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయాన్ని కుటుంబీకులకు తెలపడంతో అక్కడికి వెళ్లి చూశారు. అదే రోజు ఇంటికి వచ్చే క్రమంలో కుంటలో జారిపడి.. మృతిచెంది ఉంటాడని తెలిపారు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా.. కుంట వైపు వెళ్లకపోవటంతో ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114-00	డ్రెస్డ్	197-00
రిటైల్	136-00	స్కిన్‌లెస్	224-00

కుటుంబ కలహాలతో బలవన్మరణం

తూప్రాన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్‌కు చెందిన శ్రీశైలం(45) కొంతకాలంగా కుటుంబంతో కలిసి తూప్రాన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కుటుంబంలో గొడవ జరగడంతో శనివారం అర్ధరాత్రి దాటాక ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..



కుమార్

నిజాంపేట, రామాయంపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్(41) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుటుంబ బాగోగులు సరిగా చూసుకోలేకపోతున్నానని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన కుమార్ గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించడంతో విషయం వెలుగు చూసింది. భార్య మంజుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

సింగపూర్‌లో తీరొక్క పూలు.. పాటల హోరు

చేగుంట, న్యూస్‌టుడే: సింగపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. అక్కడి తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాదిగా పాల్గొన్నట్లు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన టీసీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బసికె ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తల్లిదండ్రులు సైతం సింగపూర్‌కు వెళ్లారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి మూడు గంటల పాటు పాటలు పాడుతూ ఆడారు. చిన్నపిల్లలు, యువతులు, మహిళలు ఆనందోత్సవాల మధ్య పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



పట్టుదలతో సాగితే విజయం ఖాయం



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, రమేశ్, ఆదర్శ్, పీడీలు



క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారిణులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయం ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. పోటీల పరిశీలకులు ఆదర్శ్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, తదితరులు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలోని సియోల్‌లో నిర్వహించిన స్లమ్ సాకర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో దేశం తరఫున పాల్గొన్న మెదక్ క్రీడాకారిణి కావేరికి.. చంద్రపాల్ టోపీ, బ్యాగ్ అందించి అభినందించారు. సమన్వయకర్త నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, రాజేందర్, మహిపాల్, ప్రతాప్ సింగ్, రవి, సత్యం, మాలతి, లతీఫ్ తదితరులున్నారు.

- మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది.
- ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

ప్రార్థనాలయం.. భక్తి పారవశ్యం



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తిపారవశ్యంతో కరుణామయుడి ప్రార్థనలు కొనసాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వాసులతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తరలివచ్చారు. ఏసయ్యను దర్శించుకొని ప్రార్థనలుచేపట్టారు. భక్తులు, పర్యాటకులతో మహాదేవాలయం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనామందిరంలో ప్రతిష్ఠించి ఆరాధనలు చేపట్టారు. మెదక్ ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు రిచార్డ్ దైవసందేశం వినిపించారు. భక్త బృందాలు ఆలపించిన పాటలు అలరించాయి. గురువులు జైపాల్, శ్రీనివాస్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి.. ఉపాధికి పెన్నిధి

మెదక్ జిల్లాలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు అడుగులు

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి

పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అనువైన చోట మరిన్ని భూములు సేకరించి యువతకు ఉపాధి ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది. మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 150కి పైగా భారీ, మధ్య చిన్నతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో 350 ఎకరాలకు పైగా సేకరించి అక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ఇక్కడి యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది.

పరికిబండ శివారులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇక్కడ 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీఎస్ఐఐసీ అధికారులకు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇక్కడ లాజిస్టిక్స్ పరిశ్రమ ఏర్పాటైతే 3 వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉంది.



పరికిబండ శివారులో టీఎస్ఐఐసీకి అప్పగించనున్న భూమి

డ్రై పోర్టు..

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి రోడ్డు, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువుల ఎగుమతికి వీలుగా దీన్ని ఏర్పాటుచేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి. డ్రైపోర్టు నిర్మాణంతో పర్యావరణానికి ఎలాంటి ఉంది. గోదాములు నిర్మిస్తారు.

234 ఎకరాలు..

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో 234 ఎకరాలను సేకరించారు. సాగులో ఉన్న రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూములకు రూ.12.5 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్లు పరిహారం అందజేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పరికిబండ శివారులోనే 611, 209 సర్వే నంబరు మధ్యలో 72 ఎకరాలలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు కానుంది. సమీపంలో సేకరించనున్న 44 ఎకరాలు సేకరించనున్నారు.

మరికొన్ని చోట్ల

జిల్లాలోని మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట, రామంతాపూర్ శివారులో 912 ఎకరాల అసైన్డ్ భూమిని, మనోహరాబాద్ మండలం పోతారం శివారులో 200కు పైగా ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గురువారం జరిగిన సమీక్షలో సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో ఇప్పటికే భూసేకరణ పూర్తయింది.

నిరుద్యోగులకు మేలు: శ్రీరామ్, పరికిబండ



లాజిస్టిక్ పార్కు, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగులకు మేలు. ఉద్యోగాలకు దూరం వెళ్లే బాధ తప్పుతుంది. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో స్థానికులకు పెద్దపీట వేయాలి. అధికారులు త్వరగా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ పూర్తి: జయచంద్రారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో



పరికిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేశాం. మెదక్ జిల్లాలో రైల్వే లైను, కొత్తగా రీజనల్ రింగు రోడ్డు రానున్న నేపథ్యంలో ఇక్కడ ఎక్కువ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానంలో పాల్గొన్న మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రావణి, అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్‌కుమార్ మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మూడునెలకోసారి రక్తం ఇస్తే చెడు రక్తం పోయి మంచి రక్తం తయారవుతుందన్నారు. రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన అసోసియేషన్ ప్రతినిధులను రక్తనిధి కేంద్రం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రక్తనిధి కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిరం ఆవరణలో ఐదురోజుల పాటు నిర్వహించే భజన, సంకీర్తనల కార్యక్రమాలను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పండుగల సందర్భంగా నిర్వహించే భక్తి కార్యక్రమాల వల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయ మాజీ ఛైర్మన్ నీల వెంకటేశం, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డి సంక్షేమ సంఘ' భవన నిర్మాణానికి వితరణ

గుమ్మడిదల:గుమ్మడిదలలో 'రెడ్డి సంఘం భవన నిర్మాణానికి చిమ్ముల నర్సింహారెడ్డి కుమారులు గోవర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు రూ.6 లక్షల చెక్కును ఆ సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డికి అందచేశారు. 'సీజీఆర్ ట్రస్టు' ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలకు తప్పని ఎదురుచూపు

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే:


నాగల్‌గిద్దలో సాగైన పత్తి పంట

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఇస్తున్న రైతుబంధు పథకాన్ని 'రైతు భరోసా'గా మార్పు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక సాయం జులైలోనే అందించాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల తాత్సారం జరిగింది. ప్రస్తుతం రబీ సీజన్ వచ్చినా రైతు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. పెట్టుబడికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలామంది మిగిలిపోయారు. దసరా నాటికైనా భరోసా అందుతుందని అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఇదీ సంగతి: జిల్లాలో 5,48,348 ఎకరాల్లో 3.12 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానమైన పత్తి 3,31,482 ఎకరాలు, మొక్కజొన్న 8,450 ఎకరాలు, సోయాబీన్ 66,128 ఎకరాలు, కందులు 67,748 ఎకరాలు, మినుము 10,421 ఎకరాలు, పెసర 7,586 ఎకరాలు సాగుచేశారు. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో వర్షాధారంపైనే అత్యధికంగా రైతులు పంటలు పండిస్తున్నారు. పెట్టుబడికి ప్రతి సీజన్‌లో ప్రభుత్వం డబ్బులు జమ చేసేది. ఇప్పటికీ వేయకపోవడంతో అప్పులు చేసి నష్టపోతున్నారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో నిధులు సిద్ధం చేయగా కోడ్ రావడంతో నిలిచిపోయింది. అప్పటి నుంచి రైతు భరోసా రైతులకు అందలేదు. తాజాగా ప్రభుత్వం దసరాకు భరోసా ఇస్తామంటోంది. రెండు పంటలవి కలిపి ఎకరాకు రూ.15వేలు జమ చేస్తుందా లే ఖరీఫ్‌వి మాత్రమే జమ చేస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు.

దసరాకు వచ్చేనా?

ఆగస్టు 15 నుంచి రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలా మంది రైతులకు డబ్బులు అందలేదు. ఖరీఫ్ సీజన్ పంట కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. పంట మొదట్లో ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కనీసం చివర్లోనైనా ఇస్తే బాగుందని జిల్లాలోని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసాకు కటాఫ్ ఎన్ని ఎకరాలు ఉండబోతుందో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇస్తే మిగతా వారికి దూరం కానుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నవారికి కూడా రైతుభరోసా కోత పెట్టాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి వాటన్నింటికీ నెలాఖరులోపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ

? జోగిపేట పట్టణంలోని 16వ వార్డులోని మజీద్ వెనకభాగంలో పొదలు పెరిగాయి. వీటిల్లో పందులతోపాటు పాముల సంచారం పెరిగింది. ఈ ప్రాంతం నుంచి వెళ్లే పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. **–మురళి, జోగిపేట.**

✓ మజీద్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేయిస్తాం. పందులు, పాముల సంచారం లేకుండా చర్యలు తీసుకుంటాం.
–వినయ్‌కుమార్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అందోలు– జోగిపేట.

? అందోలు మండలం పోసానిపేట గ్రామం మంజీరా నది తీర వ్యవసాయ భూముల మధ్య నుంచి వెళ్తున్న విద్యుతు స్తంభాల తీగలు కిందకు వాలాయి. వీటి వల్ల రైతులకు ప్రమాదం పొంచి ఉంది.
–నర్సింలు, పోసానిపేట.

✓ ప్రమాదకర తీగలు సరిచేయిస్తాం. **–శ్రీనివాస్, ఏఈ, అందోలు.**

? సంగారెడ్డిలోని శివాజీ నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు బయటకు రావాలంటే భయంగా ఉంది. **– కుమార్, సంగారెడ్డి.**

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.**

? సంగారెడ్డి పట్టణం బ్యాంకు కాలనీలో చెత్త సేకరణ సిబ్బంది సరిగా రావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం.
– రాములు, సంగారెడ్డి.

✓ చెత్త సేకరణ సిబ్బంది క్రమం తప్పకుండా వచ్చేలా సూచనలు చేస్తాం. **– సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సంగారెడ్డి.**

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కమిటీ


'పర్యావరణ పరిరక్షణ సమితి' సభ్యులు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పచ్చని చెట్లు, ప్రశాంత వాతావరణం కాపాడుకోవడానికి నల్లవల్లి గ్రామ యువకులు, గ్రామస్తులు ఐక్యంగా పోరాటానికి సిద్ధమయ్యారు. ఆదివారం నల్లవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నల్లవల్లి పరిధిలోని ప్యారనగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా 'పర్యావరణ పరిరక్షణ సమితి' పేరుతో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో పోరాటం చేయడానికి ముందుకు సాగుదామని యువకులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.

ఖేడ్‌లో 'పద సంచలన్'

నారాయణఖేడ్: విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆరెస్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఖేడ్ శ్రీరామ మందిరంలో పద సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. వక్తగా హాజరైన జిల్లా సంఘ సహకార్యవాహ కొప్పుల మహేందర్ విజయదశమి పండుగ ప్రాముఖ్యతను గురించి వివరించారు. డా. వినయ్ ఖేడ్ ఖండ వాహ వడిత్య ప్రసాద్, ఇతర బాధ్యులు అనిల్, నరసింహులు, నగేశం, దత్తు, దిలీప్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఓబన్న ఆశయాలు అనుసరణీయం


నివాళి అర్పిస్తున్న నీలం మధు తదితరులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: బ్రిటిషర్ల వెన్నులో వణుకు పుట్టించిన వడ్డే ఓబన్న ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వడ్డెర సంఘం సభ్యులు పొక్లెయిన్‌తో నీలం మధుకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రత్యేకంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్‌ను సైతం నియమించిందన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీశైలం, మాజీ సర్పంచి రవీందర్ పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సిర్గాపూర్: మండలంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ఉపాధ్యాయ, అధ్యాపకుల ఖాళీల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హేమలత ఆదివారం పేర్కొన్నారు. జంతుశాస్త్రం, పీజీటీ తెలుగు, పీజీటీ మ్యాథ్స్, పీజీటీ సైన్స్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 21వ తేదీన అర్హత కార్యాలయంలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

'ప్రభుత్వ భూములు కాపాడాలి'

నారాయణఖేడ్: ప్రభుత్వ భూముల నుంచి ప్రైవేటు వెంచర్లకు దారులు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిరంజీవి, గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లో వారు మాట్లాడుతూ నాగల్‌గిద్ద మండలం, ఖేడ్ మండలం హన్మాన్(బి)లో ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేశారని తెలిపారు. నాయకులు అశోక్, సతీష్, రాము, సంజీవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


రామాలయ నిర్మాణ పనుల పరిశీలన

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో విశిష్ట చరిత్ర కలిగిన పురాతన శ్రీరామాలయ పునర్నిర్మాణంతోపాటు ఆవరణలో కల్యాణ మండప పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా పనులను దాతలు ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్‌తోపాటు పురపాలిక కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్‌చౌహాన్, ఆలయ కమిటీ సభ్యులు పాండు, నాయకులు కొండల్‌రెడ్డి, మాణిక్‌రావు ఆదివారం పరిశీలించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

వటపల్లి: విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు జేఎంఎం సుధాకర్ ఆదివారం తెలిపారు. మేడికుంద విద్యుత్తు ఉప కేంద్రం నుంచి వటపల్లి కూడలి వరకు ఉన్న స్తంభాలు, తీగల సమీపంలోని చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్తు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అసంపూర్తిగా ఆర్డీవో కార్యాలయ భవనం



సంగారెడ్డి ఆర్డీవో భవన నిర్మాణానికి 2012-13లో రూ.2.50కోట్లతో జిల్లా యంత్రాంగం నిధులు మంజూరు చేసింది. సదరు గుత్తేదారు నిర్మాణ పనులు ప్రారంభించారు. తీరా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారుడు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిపివేశాడు. ఇలా ఏళ్లుగా పనులు జరగకపోవడంతో భవనంలో తీగ మొక్కలు, పొదలు పెరిగి దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం భవన ఇనుము అంతా తుప్పు పట్టిపోతుంది. ఈ విషయమై ఏఈ శశాంక్‌ను అడగ్గా కొత్తగా నిధులు మంజూరు చేయించి అసంపూర్తి భవన నిర్మాణం పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

తీరొక్క పూలతో బతుకమ్మ సంబరాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, జిన్నారం: న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ విద్యార్థినులు ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. అధ్యాపకులు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళా సభ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు రాణి, కో-ఆర్డినేటర్ కల్పన, ప్రిన్సిపల్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు. * ఐడీఏ బొల్లారం పట్టణం మల్లన్నబస్తీలో 'టీమ్ విశ్వ నేత్ర యూత్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు ఘనంగా సాగాయి. ఈ మేరకు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారుచేసి పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు, పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి ఆటపాటలతో సంబురంలో పాల్గొన్నారు.


ఐడీఏ బొల్లారం మల్లన్నబస్తీలో...


సంగారెడ్డిలో...

'అలయ్-బలయ్'కి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వటపల్లి: దసరా పండగ అనంతరం ఈనెల 14న నిర్వహించే అలయ్-బలయ్ కార్యక్రమం నిర్వహణకు ఆదివారం వటపల్లిలోని శ్రీవెంకట ఖ్వాజా చిష్తి ఫంక్షన్ హాలులో స్థలాన్ని పరిశీలించినట్లు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరము సంస్థ మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి, భారాస మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, కోశాధికారి సుభాష్, ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, పీఏసీఎస్ సంచాలకుడు బుద్ధిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావుకు మంత్రి దామోదర్ పరామర్శ



మునిపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావును రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. ఆదివారం బుధేరాలోని రాజేశ్వర్‌రావు నివాసానికి వెళ్లి.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రహీం వెంట ఉన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

నారాయణఖేడ్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ తహసీల్ మైదానంలో ఆదివారం పట్లోళ్ల కిష్టారెడ్డి(పీకేఆర్) ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలిక ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఉపఛైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్, నర్సింహులు, మాజీద్, హన్మాండ్లు, రామకృష్ణ, సద్దాం, మాజీ ఎంపీపీ జీవులానాయక్ పాల్గొన్నారు.

హత్నూరలో ఉత్సాహంగా...



హత్నూర, న్యూస్‌టుడే: స్థానిక స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో మండలస్థాయి క్రికెట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హత్నూరతో పాటు ఇతర మండలాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 9 జట్లు పేర్లు నమోదు చేసుకోగా తొలి రోజు పోటీలు ఆసక్తికరంగా సాగాయి.

కొండాపూర్: దసరా సెలవులను పురస్కరించుకొని కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించండి

నారాయణఖేడ్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు జి.ఎస్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కంది, జిన్నారం:కంది అక్షయపాత్ర ఫౌండేషన్‌లో డెలివరీ బాయ్స్‌గా పనిచేసే ముగ్గురు యువకులు జులై 25న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. వారి కుటుంబాలకు అక్షయపాత్ర యాజమాన్యం, కొందరు ఉద్యోగులు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ఆదివారం అందజేశారు. అక్షయపాత్ర సిబ్బంది, వినయ్, మధుసూదన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. * ఊట్ల పరిధి దాదిగూడెంకు చెందిన వడ్డేపల్లి యాదగిరి అనారోగ్యంతో మృతిచెందగా.. . ఎంఎంఆర్ అధినేత నీలం మధు రూ.5 వేల సాయం చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కంది, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు పేర్కొన్నారు. కందిలో సాధారణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజా సమస్యలు విస్మరిస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

బాలాత్రిపురసుందరిగా దుర్గామాత


కేబీఆర్ కాలనీలో దుర్గామాత మండపంలో పూజలు

జోగిపేట టౌన్, మనూరు, జిన్నారం, జహీరాబాద్: జోగిపేట పట్టణంలో స్నేహ, సిరి, మాత యువజన సంఘాల ఆధ్వర్యంలో పబ్బతి హనుమాన్ ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన మండపంలో దేవీశరన్నవ రాత్రోత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కమిషనర్ తిరుపతి, భక్తులు పాల్గొన్నారు. ● మనూరు, నాగల్‌గిద్ద మండలంలోని బోరంచ, బాదల్‌గామ్, మనూరు, మాయికోడ్, డొవ్వూర్, నాగల్‌గిద్ద, ఎనక్‌పల్లి, ఎల్గోయి తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. బోరంచలోని నల్లపోచమ్మ అమ్మవారు త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ● ఐడీఏ బొల్లారం భవాని శంకర సాయి సన్నిధిలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కిష్టాయపల్లి, ఖాజీపల్లి, జంగంపేట, జిన్నారంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ● మహారాష్ట్ర తుల్జాపూర్‌లోని తుల్జాభవానిఆలయానికి భక్తులు పోటెత్తారు. కిలోమీటర్ల మేర బారులు తీరారు.


బోరంచలో అమ్మవారికి దర్శించుకుంటున్న భక్తులు


మంగల్‌పేటలో...


మహారాష్ట్ర తుల్జాభవాని మందిరం వద్ద బారులు...

వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని ఇద్దరి మృతి

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి(35) మృతిచెందినట్లు పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఎర్రని షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి కుడి చేతిపై ఎస్. మంగళ అని పచ్చబొట్టు ఉందని, గుర్తించిన వ్యక్తులు సెల్: 8712656763 సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు. ● జహీరాబాద్ పట్టణ పరిధి రంజోల్ సమీపంలోని చాకిరేవులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహం లభ్యమైనట్లు గ్రామీణ ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ బస్టాండ్‌లో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన వ్యక్తిని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒకటో ఠాణా ఎస్సై రాజన్న తెలిపిన ప్రకారం... సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ చిరాక్‌పల్లికి చెందిన మద్ది సిద్ధు ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి కరీంనగర్ బస్టాండ్‌లో ఓ బస్సు పైకి ఎక్కి కూర్చున్నాడు. డ్రైవర్ సురేష్ అతన్ని కిందకు దిగాలని కోరినా వినలేదు. చిన్న కత్తితో సురేష్‌పై దాడి చేయగా చేతికి గాయమైంది. డ్రైవర్ ఫిర్యాదు మేరకు సిద్ధుపై కేసు నమోదు చేశారు. ఆదివారం అరెస్టు చేసి జైలుకు పంపించారు.

కొనసాగుతున్న సభ్యత్వాలు


నమోదు పత్రాలు అందిస్తున్న భాజపా నేతలు

జహీరాబాద్: పట్టణంలో రంజోల్, నారాయణనగర్, ఎన్జీవోస్, వెంకటరమణ కాలనీల్లో ఆదివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ ప్రతాపరెడ్డి, సహాకన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, అసెంబ్లీ సభ్యత్వ ఇన్‌ఛార్జి భాస్కర్ యాదవ్, జిల్లా కార్యదర్శి అరుణ కౌలాస్వార్టీ, పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్ స్వామి పాల్గొన్నారు.

మాయికోడ్‌లో యజ్ఞం


పూజల్లో పాల్గొన్న భక్తులు

మనూరు, న్యూస్‌టుడే: మనూరు మండలం మాయికోడ్‌లోని స్థానిక హనుమాన్ ఆలయం ఆవరణలో గ్రామ వివేకానంద స్వామి సేవా సమితి అధ్వర్యంలో ఆదివారం యజ్ఞం నిర్వహించారు. హైదరబాద్‌లోని వైదిక ధర్మ ప్రచార సమితి బాధ్యులు బీమన్న వేద మంత్రాలతో యజ్ఞం నిర్వహించారు. వివేకానంద స్వామి సేవా సమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు బయలుదేరిన దీక్షాధారులు



నారాయణఖేడ్: ఖేడ్ మండలం నమ్లిమెట్ పంచాయతీ పరిధిలోని పలు గిరిజనతండాలకు చెందిన సేవాలాల్ మహరాజ్, భవానీమాత దీక్షాధారులు ఆదివారం మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన పౌరాదేవిలోని సంత్‌శ్రీసేవాలాల్ మహరాజ్, భవానీమాత ఆలయాలు, పండరీపూర్‌లోని రుక్మిణిపాండురంగ ఆలయం, తుల్జాపూర్‌లోని దుర్గాభవానీమాత ఆలయాలను దర్శించుకునేందుకు పలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఖేడ్ జంటగ్రామమైన భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రవాస భారతీయుడైన జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గుర్రపు మశ్చేందర్ దీక్షాధారులను సన్మానించి వాహనాల ఎదుట జెండా ఊపి సాగనంపారు.

దీక్షల విరమణ



పుల్కల్: గిరిజనుల ఆరాధ్య దైవం అయిన భవానీసేవాలాల్ మహరాజ్ స్మరణలో చౌటకూరు మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెంలో పలువురు దీక్షలు స్వీకరించారు. 41 రోజులపాటు భక్తిశ్రద్ధలతో, కఠిన నియమాలు పాటిస్తూ దీక్షలు కొనసాగించారు. ఆదివారం స్థానిక భవానీ, సేవాలాల్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.